# జీవనరాగం

కె. విజయకుమార్



పక్షుల కిలకిలారావాలతో డాబా మీద పడుకున్న నాకు మెలకువ వచ్చింది. కళ్లు భగ్గుమంటున్నాయి, రాత్రి చాలా సేపు మేలుకున్నందుకు గుర్తుగా. తరతరాల నుంచి మన ప్రమేయం లేకుండా వ్యవస్థ మనపై ప్రభావితం చేస్తున్న భావాలు, దాన్నెదుర్కోలేని మనుషుల బలహీనత, తద్వారా వచ్చే సమాధానం లేని ప్రశ్నల గురించి రాత్రి నేనూ, అమ్మా చర్చించాము.

"లేవండి, లేవండి! ఈరోజు నీళ్లొస్తాయి!" చుట్టుపక్కల వాళ్ల అరుపులు. మూడు రోజులకొకసారి వచ్చే నీటి కోసం అందరిలో ఆత్రుతతో కూడిన నిరీక్షణ.

"తొందరగా కారేజి కట్టవే, డ్యూటీకి టైమవుతోంది, నీ యవ్వ!" ఎదురింటి గోపాలం గొడవ.

"ఆ పాలవాడింకా చావలేదు! ముసలాడు కాఫీ కాఫీ అని గింజుకుంటున్నాడు!" పక్కింటి సావిత్రి విసుర్లు.

"నాన్నా! నా యూనిఫామ్ కనపడట్లేదు!" చిన్నిగాడి గోల.

వీటన్నిటినీ డామినేట్ చేస్తూ రైలు కూత. ఉదయం చల్లదనాన్ని ఆట్టే ఆస్వాదించనీయకుండా సూర్యుడు తన ప్రతాపాన్ని ప్రదర్శిస్తున్నాడు. పేపర్‌వాడు పేపర్ విసిరిపోయాడు. "ఏమిట్రా విశేషాలు?" అమ్మ ప్రశ్న. 'అప్పులు తీర్చలేక కుటుంబం సామూహిక ఆత్మహత్య. కూతురు పెండ్లికి అడిగినంత కట్నం ఇవ్వలేక రైలు కింద పడి తల్లిదండ్రుల మృతి!'

"అమ్మా! భిక్షాం దేహి!" ఎక్కడో సన్నని కేక.

"మా జీతాల పెరుగుదల గురించి ఏమైనా వార్తుందా చూడు, నాయనా!" పక్కింటి కామేశం ఆత్రుత. మునిసిపాలిటీ పనివాళ్లు కాలవల్లోని చెత్తను తీసి రోడ్డు మీదేస్తున్నారు. ఇందాక భిక్షాందేహి అని అరచిన ముసలి బిచ్చగాళ్లు ఇంటి ముందుకొచ్చారు. మాసిన బట్టలు, చేతికర్ర, సత్తు గిన్నె. ఒకరి ఆసరాతో ఒకరు మెల్లగా ఒడుగుమీద అడుగేస్తున్నారు. అందరినీ చూస్తున్న నాకు వాళ్లిద్దరూ ప్రత్యేకంగా కనిపిస్తున్నారు.

"నువ్వేన్నయినా చెప్పరా, దేన్నీ పట్టించుకోని నీ నిర్లిప్తత నాకేమీ నచ్చలేదు!" అమ్మ రాత్రి చర్చను గుర్తు చేస్తూ అంది.

"నీళ్లొచ్చేశాయి! నీళ్లొచ్చేశాయ్! అందరూ రండి!". నేనూ, అమ్మా వాకిట్లోకి వచ్చాము.

ముసలి భిక్షగాళ్లు మురికి కాలువ పక్కనే ఎదురెదురుగా కూర్చున్నారు. మూటలోంచి ఒక్కొక్కటే ఆహార పదార్థాలు తీస్తున్నారు. అన్నం, చపాతీ, దోసె వగైరా ... వారికి తోడుగా రెండు కుక్కలు కూడా చేరాయి.

ముసలి భిక్షగత్తె చపాతీ ముక్కను భర్త నోట్లో ఆప్యాయంగా పెడుతోంది. వారిస్తూనే దాన్ని అందుకుంటున్నాడతను. అమ్మ తదేకంగా చూస్తోంది వాళ్లను. తినడం పూర్తయింది. సత్తుగ్లాసులో నీళ్లు తాగిస్తోంది ముసలమ్మ భర్తకు.

చుట్టుపక్కల పరిసరాల్ని, జనాలను ఒకసారి పరికించిన ముసలాయు బీడీ వెలిగించి గట్టిగా ఓ దమ్ము లాగాడు.

• ఆ దృశ్యాన్ని చూసిన అమ్మ ఏదో అర్థమైనట్టు చిన్నగా నవ్వుకుంది.

■